# రమ్యభారతి

సాహిత్య త్రైమాసపత్రిక

నవంబర్ 2018 – జనవరి 2019 వెల.రూ.10/-





❊ ఈ సంచిక మంచి పుస్తకం

**బి.హనుమారెడ్డి 'అంతర్వాహిని'**

❊ **వందేళ్ళ గ్రంథాలయం**

❊ **సోమేపల్లి పురస్కార కథల పోటీ ఫలితాలు**

# వందేళ్ళ గ్రంథాలయం- వేటపాలెం 'సారస్వత నికేతనం'

- బీరం సుందరరావు 9848039080






**22-11-1935న గ్రంథాలయ ఆవరణలో ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌చే ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం, గ్రంథాలయంలో భద్రపర్చబడిన పుస్తకాలు**

"అప్పిచ్చువాడు వైద్యుడు"- అనే పద్యాన్ని ఎప్పుడో చిన్నప్పుడు చదివిన గుర్తు. గ్రామానికి కనీస సౌకర్యాలు ఏం ఉండాలో చక్కగా చెప్పిన పద్యమది. ఆ కాలానికే కాదు, ఏ కాలానికైనా వర్తించే నిత్య సత్యమది. జనం నివశించే ఊరికి విద్యాలయం, వైద్యాలయం, గ్రంథాలయం, దేవాలయం తప్పని సరిగా వుండాలి. పై నాల్గింటిలో దేవాలయం విధిగా ఉంటుంది. దాతలు సహకరిస్తే విద్యాలయం వుంటుంది. మధ్యలో వున్న రెండింటి ప్రాధాన్యతను మన సమాజం ఇప్పటికీ గుర్తించలేదు. మన పాలకులు ఎప్పటికీ గుర్తించరు.

మనిషి అరోగ్యవంతుడనడానికి అవయవాలన్నీ బాగా పని చేయాలి. అలాగే సమాజం ఆరోగ్యంగా వుందనడానికి పై నాలుగు అంటే బడి, గుడి, హాస్పటల్, లైబ్రరీ విధిగా వుండాలి. వీటి అవసరాలన్ని మన పెద్దలు గుర్తించారు. మనిషి జ్ఞానవంతుడు కావడానికి బడి, పరిశుద్ధుడు కావడానికి గుడి, ఆరోగ్యవంతుడు కావడానికి హాస్పటల్, సదాలోచనతో, సత్ప్రవర్తనతో పరిపూర్ణంగా ఎదగడానికి గ్రంథాలయం ముఖ్యమని భావించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఒకవైపు సమరదీప్తి, మరోవైపు గ్రంథాలయాల వ్యాప్తి స్వాతంత్ర్య సాధనకు క్రియాశీలకంగా దోహదపడ్డాయి. చదువు విలువ గుర్తించిన మన పెద్దలు, విద్యావేత్తలు, కవులు, సంస్కర్తలు, దేశభక్తులైన నాయకులు ఊరూరా గ్రంథాలయాల స్థాపనకు నడుం కట్టారు. సొంత ధనాన్ని ఖర్చు చేసి పుస్తకాలు సమకూర్చారు. పత్రికలు తెప్పించారు. వయోజన విద్యా

**శుభాకాంక్షలు:** ఆంధ్రప్రదేశ్ జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్‌గా పొట్లూరి హరికృష్ణ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారికి 'రమ్యభారతి' శుభాకాంక్షలు అందజేస్తున్నది.

# కార్డ్ కథలు

## పరివర్తన

- ఆళ్ళ నాగేశ్వరరావు
7416638823

నవోదయ నాటక సమాజం వారు గత నెల రోజుల నుంచి పరివర్తన అనే నాటకానికి రిహార్సల్స్ కొరకు ఒక్క హీరోయిన్ తప్ప మిగతా పురుష పాత్రదారులందరూ ఆ ఇంటి ప్రాంగణంలో సమావేశమైనారు. అనుకున్న సమయానికన్నా గంట సమయం గడిచినా పొరుగూరు నుంచి రావాల్సిన హీరోయిన్ రాకపోవడంతో అక్కడ చేరిన పురుష పాత్రదారులు ఆమె గురించి తలో రకంగా దుర్భాషలాడుతూ, ఆమె వ్యక్తిత్వాన్ని కించ పరిచే విధంగా మాట్లాడుతున్న సందర్భంలో ప్రక్క గదిలో ఉండి వీరి సంభాషణంతా వింటున్న ఆ నాటిక దర్శకుడు ఒక్కసారిగా వారి ముందుకొచ్చి-

"ఆగండి... మీ అందరికి నేనో పరీక్ష పెడ్తానని" చెప్పి వున్న 10 మందికి పది తెల్లకాగితాలు ఇచ్చి, గంట టైములో మీకు తెల్సిన పతివ్రతల పేర్లను రాయమని అడిగాడు.

గంట గడిచాక అందరి వద్ద తెల్ల కాగితాలు తీసుకుని చూడగా అందరూ 'అనసూయ, సతీ సావిత్రి, సీతాదేవి'లాంటి దేవతల పేర్లు రాయడం గమనించి- "చూసారా! ఎవరెవరి పేర్లో పతివ్రత లుగా రాశారు గానీ, మీ భార్యల పేర్లు ఎందుకు రాయలేదు?... అంటే ఆమెపై మీకు నమ్మకం లేదా?" అని ప్రశ్నించాడు. కలిసి కాపురం చేసే భార్యని నమ్మలేని వారికి, సాటి కళాకారిణిని నిందించే హక్కు ఎక్కడుంది? అందుకే స్త్రీలను గౌరవించే పరివర్తన ముందుగా మీలో రావాలి. మనం మారితేనే సమాజం మారుతుందని ఆయన హితువు పలికాడు. ❀

## 'ఈనో'

- చోరగుడి మల్లికార్జునశర్మ
9849561683

ఏదో పని మీద లేబాక నుండి కడప కొచ్చాడు రైతు మల్లయ్య. పనుల మీద తిరుగుతూ ఆకలైనప్పుడు మిరపకాయబజ్జీలు, పానీపూరీలు తెగ తిన్నాడు. మధ్యాహ్నం అయ్యేసరికి అతనికి కడుపులో మంటలు. గ్యాస్ పైకి తన్నడం మొదలైంది. అది తట్టుకోలేక మనోడు అలవాటు ప్రకారం దగ్గర్లోని మెడికల్ షాపులో దూరి, షాపు వాడికి విషయం చెప్పి-

"ఏదైనా మందివ్వండి" అన్నాడు.

"ఈనో" అన్నాడు.

దానికి మనోడు "అదేంటి సారూ!... మందడిగితే ఈనంటావు? డబ్బులిస్తాను కదా!" అన్నాడు.

షాపువాడు- "చెప్పానుగా...ఇదిగో ఈనో" అని మళ్ళీ అదే మాట అన్నాడు.

"అరే!.. మళ్ళీ అదే మాటా.. నేను ఫ్రీగా ఇమ్మనడం లేదు కదా! డబ్బులు ఇస్తానన్నా కదా" కయ్యిమన్నాడు రైతు.

"అరే సామీ... నేను ఈననడం లేదు. మందు పేరే 'ఈనో'. ఇదిగో ఈ ప్యాకెట్ పొడి గ్లాసు నీళ్ళలో కలుపుకుని తాగు. మంట తగ్గుతుంది" అన్నాడు షాపువాడు.

"ఆ...!" అని నోరెళ్ళబెట్టిన ఆ రైతు మల్లయ్య 'ఇంకా నయం... 'పోరా' అని పేరు పెట్టలేదు" మనసులో అనుకుంటూ బుర్ర బరుక్కున్నాడు. ❀

**వార్త: జనవరి 6,7 తేదిలలో విజయవాడలో 'కృష్ణాజిల్లా రచయితల సంఘం' ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ రచయిత్రుల ప్రథమ మహాసభలు' ఘనంగా జరిగాయి.**

**పుస్తక పరిచయం**

# తెలుగు సాహిత్యపు గుభాళింపును చూపిన 'వ్యాసభూమి'




**'వ్యాసభూమి' (వ్యాస సంపుటి)**

రచన: డా॥ సి.భవానీదేవి; పుటలు: 242, వెల.రూ.200, ప్రతులకు: **డా॥ సి.భవానీదేవి, హిమబిందు పబ్లికేషన్స్, 102, గగన్‌మహల్ అపార్ట్‌మెంట్స్, దోమలగూడ, హైదరాబాద్- 500 029**

**డా॥** చిల్లర భవానీదేవి రచయిత్రిగా, కవయిత్రిగా, పరిశోధకురాలిగా ఆమెలోని బహుముఖ ప్రజ్ఞ తెలుగు సాహిత్యలోకానికి తెలిసినదే!

వివిధ సందర్భాలలో వివిధ పత్రికలు ప్రచురించిన ప్రత్యేక సంచికల కోసం ఆవిడ రాసిన పరిశోధనా వ్యాసాల పరంపరే ఈ 'వ్యాసభూమి' సంపుటి. ఇందులో 'రాయప్రోలు తృణకంకణం- సమకాలీనత, దేవరకొండ బాలగంగాధర తిలక్ - ఒక గొప్పకథ, కొవ్వలి నవలలు- కుటుంబ వ్యవస్థ, వచన కవిత్వంలో కథాకావ్యాలు, వేటూరి గీతాల్లో స్త్రీ చైతన్యం, కేతు కథల్లో స్త్రీ పాత్రలు, 'స్థిత ప్రజ్ఞ' శ్రీ పి.వి.నరసింహారావు, కవిత్వంలో మానవ సంబంధాలు, తెలుగు కథలు- ఆర్ద్రత, గోపి నానీలు- విశ్లేషణ, డా॥ పెళ్ళకూరి జయప్రద కథల్లో సంప్రదాయం, తెలుగు సాహిత్య చరిత్ర- ఒక పరిచయం' వంటి 30 శీర్షికలతో తెలుగు సాహిత్య రంగంలోని ముఖ్యమైన అంశాలను స్పృశిస్తూ, అతి క్లుప్తంగా అందరికీ అర్థమయ్యే భాషలో, ఆసక్తిదాయకంగా చదివించే వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

'అమృతం కురిసిన రాత్రి' ద్వారా కవిగా ఎనలేని కీర్తిని గడించిన దేవరకొండ బాలగంగాధర్ తిలక్, కొన్ని కథలే రాసిన తిలక్‌ను కథకునిగా కూడా భవానీదేవి పరిచయం చేస్తూ ఆయన రాసిన కథల్లో అందరూ మెచ్చిన 'నల్లజర్ల రోడ్డు'ను 'ఒక గొప్ప కథ'గా విపులీకరించిన తీరును గమనిద్దాం. కథంతా ఒకటి రెండు పేరాల్లో చెప్పిన ఆమె, అందులోని నీతిని, సారాంశాన్ని ఇలా వివరిస్తారు- "అడవి గురించి తిలక్ ఇలా అంటాడు. 'మనుష్యులకు నివాసంగాని ఈ కీకరాణ్యం జంతువులకి సహజమైన ఆవాసంగా ఉంది. ప్రతి ప్రాణీ ఇక్కడ తనను తాను రక్షించుకుంటూ తనకన్న అల్పమైనదానిని భక్షిస్తూ బతుకుతుంటుంది' మానవులు నాగరికులమని చెప్తారు. నీతి నియమాలున్నాయని అంటారు. కానీ నిజానికి అడవిలో జంతువుల్లా తమ ప్రయోజనాలు తప్ప దేనినీ లెక్కచేయటంలేదని ఈ కథ సమర్థవంతంగా చెప్తుంది"...దుఃఖితులపట్ల మానవ బలహీనతలపట్ల చిత్రమైన సానుభూతి తిలక్ కథల్ని సజీవంగా నిలుపుతుంది. 1964వ సంవత్సరంలో రచింపబడిన ఈ కథ కథాభిమానులంతా చదవదగింది' అంటారు భవానీదేవి.

'కవిత్వంలో మానవ సంబంధాలు' వ్యాసంలో "ప్రాచీనకాలంలో కావ్యాలు వెలయించిన వాళ్ళంతా ఋషులే! అందుకేనేమో కవి అంటే ఋషి అనే అర్థాన్ని కూడా సూచించడం జరిగింది" అంటూ నేడు విస్తృతంగా కవిత్వం రాస్తున్న కవులు రాసిన కొన్ని కవితా పంక్తుల్ని విశ్లేషిస్తూ అణగారిపోతున్న మానవ సంబంధాలపై ఈ వ్యాసం ఆలోచింపజేస్తుంది. ఇటువంటి అనేక విశ్లేషణలు ఇందులో సాహితీప్రియులను

**వార్త: నవంబర్ 12న కడపలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం యోగి వేమన విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో 'ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 220వ జయంతోత్సవాలు' ఘనంగా జరిగాయి.**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ramyabharati+November+2018+to+January+2019**

* * *